క్లుప్తంగా

నాగాలమ్మకు ప్రత్యేక పూజలు

పాలసముద్రం: మండలంలోని శ్రీకావేరిరాజుపురం పాత చెరువు కట్టకింద వెలసిన నాగాలమ్మకు ఆదివారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉదయం అమ్మవారిని పాలు, పెరుగు, చందనం, తేనె, నెయ్యిలతో అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం ప్రతి ఇంటి నుంచి మహిళలు పొంగళ్లు, పూజాసామగ్రితో పంబ వాయిద్యాలతో ఊరేగించి, అమ్మవారికి సమర్పించారు. మహిళలు అమ్మవారి గుడి ఆవరణలో పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. సాయంత్రం అమ్మవారిని సుందరంగా అలంకరించి ప్రత్యేక దీపారాధన పూజలు చేశారు. మొక్కుబడి ఉన్న మహిళలు అమ్మవారి ఎదుట పిండి దీపాలు వెలిగించారు.

ఆడికృత్తిక వేడుకలకు తరలిరండి


వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

కార్వేటినగరం: స్కంధ పుష్కరిణి సమీపంలోని కుమారగిరిపై వెలసి ఉన్న వళ్లీ, దేవసేన సమేత శ్రీసుబ్రమణ్య స్వామి ఆలయంలో నిర్వహించే వార్షిక ఆడికృత్తిక వేడుకలను భక్తులు విజయవంతం చేయాలని ఎండోమెంట్ ఈఓ కృష్ణనాయక్ అన్నారు. ఆదివారం ఆలయ ఆవరణలో ఆడికృత్తిక వేడుకలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎండోమెంట్ ఈఓ మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ భరణి కృత్తికతో ఆడికృత్తిక వేడుకలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. 16, 17, 18వ తేదీలలో కృత్తిక వేడుకలు ఉంటాయని భక్తులు అధిక సంఖ్యలో కావళ్లతో తరలి వచ్చి స్వామివారికి మొక్కులు తీర్చుకోవాలని పిలుపునిచ్చారు. అదే విధంగా ఆడికృత్తిక వేడుకలను పురస్కరించుకుని 16 నుంచి 18వ తేదీ వరకు స్వామివారి తెప్పోత్సవం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

సంతాన లక్ష్మిగా నేత్రప్రదాయిని



నగరి: పట్టణ పరిధిలోని నేత్రప్రదాయిని దేశమ్మ దేవత క్షేత్రంలో ఆదివారం ఆడి మాసోత్సవాలను పురస్కరించుకొని అమ్మవారికి ప్రత్యేక అభిషేక అర్చనలు చేశారు. అమ్మవారికి సంతాన లక్ష్మి అలంకరణ చేయగా అందరినీ ఆకట్టుకుంది. పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్న భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థం కళ్లలో చల్లుకున్నారు. ఆలయ ఈఓ, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వేడుకగా భూమిపూజ


గోపురం నిర్మాణానికి భూమి పూజ

నింద్ర: మండల కేంద్రమైన నింద్ర గ్రామంలో ఆదివారం శ్రీప్రసన్న వేంకటేశ్వర ఆలయం ముందు రాజగోపురం నిర్మాణ భూమి పూజ వైభవంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి, హోమం చేసి భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త ఆర్వేల రమేష్ నాయుడు పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రాచీన ఆలయ విశిష్టతను ఆయనకు వివరించారు. గోపుర నిర్మాణానికి దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి జన్మదిన వేడుకలు


జన్మదిన వేడుకల్లో మణెమ్మ

నగరి: ఎస్ఆర్ నగర్‌లో నివాసం ఉంటున్న ఎం.మణెమ్మ అనే బామ్మ ఆదివారం వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్నారు. 101 సంవత్సరాల వయస్సులోకి అడుగుపెట్టారు. ఈ సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులు ఆమెతో కేక్ కట్‌చేయించి పెద్ద ఎత్తున జన్మదిన వేడుకలను నిర్వహించారు. మణెమ్మ 1925లో జన్మించారు, ఆమెకు కుటుంబ సభ్యులు 85 మంది ఉన్నారు.

అధిక దిగుబడులకు బాట

- వరిసాగులో కాలిబాటలతో ఎంతో ప్రయోజనం
- చీడపీడల నుంచి పంటకు రక్షణ
- రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు


వరి పైరులో కాలిబాటలు

విజయపురం: వరి పంట సస్యరక్షణలో కాలిబాటలు ప్రధానమైనవి. పంటకు గాలి, వెలుతురు సక్రమంగా అందించడంలో ఇవి ఉపయోగపడతాయి. దీనివల్ల వరి పిలకలు దుబ్బు చేయడంతో పాటు చీడపీడల నుంచి ఎంతో రక్షణ కలుగుతుంది. అన్నివైపులా ఎరువులు సమానంగా వేయడంతోపాటు సులభంగా పురుగు మందులు పిచికారీ చేయవచ్చు. పంట కోత దశలో అపరాలు జల్లుకోవడానికి కాలి బాటలు ఉపయోగపడతాయి. వరి నాట్లు వేసేటప్పుడు మొలకలు దగ్గరగా నాటడంతో తెగుళ్ల వ్యాపించే అవకాశం ఉంది. అందువల్ల నాట్ల సమయంలో కాలిబాటలు వేయడంతో ఎంతో ప్రయోజనం చేకూరుతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. అలాగే నాట్లు దగ్గరగా వేయడంతో పంట ఎదిగేటప్పుడు సరైన గాలి తేమ లేకపోతే చీడపీడలకు అనుకూలంగా మారుతుంది. సుడి దోమ ఆశిస్తే చేను పూర్తిగా పాడైపోతుంది. తెగుళ్ల బెడదను తగ్గించుకోవడానికి కాలిబాటల పాయలు ఎంతగానో ఉపయోగపడతాయి.

రైతుల్లో ఆసక్తి

గతంలో చాలా మంది రైతులు కాలిబాటలు వేయడం అదనపు ఖర్చుగా భావించేవారు. దీనిపై ఆసక్తి చూపించేవారు కాదు. వ్యవసాయాధికారులు కాలిబాటల ప్రయోజనాన్ని రైతులకు విస్తృతంగా వివరించడంతో రైతులంతా బాటలు వేస్తున్నారు. కాలిబాటలు వేసే సమయంలో రైతులు యాజమాన్య పద్ధతలు పాటించాలి. ప్లాస్టిక్ లేదా డొక్క తాడు తీసుకుని గట్టు అవతలి వైపు నుంచి ఇవతలి వైపు వరకు బాగా సాగదీసి కట్టాలి. తాడు వెంబడి 12 సెంటీమీటర్లు వెడల్పున వరి నాట్లు సాగులో ఉన్న వరిచేను తొలగించి పక్కనే పలుచగా ఉన్న ప్రదేశంలో నాటుకోవాలి. వెదజల్లే పద్ధతిలో సాగు చేస్తే విత్తనాలు చల్లిన తరువాత 15 నుంచి 20 రోజుల వ్యవధిలో కాలిబాటలు వేసుకోవాలి.

ఎన్నో ప్రయోజనాలు

కాలిబాట వేయడంతో వేరు మొదళ్లకు గాలి, వెలుతురు. సూర్యరశ్మి విస్తారంగా తగులుతుంది. దీంతో పైరు ఆరోగ్యంగా ఎదుగుతుంది. చీడపీడల బెడద కొంతవరకు తగ్గుతుంది. కాలిబాట మార్గంలో వెళ్లి కలుపు తొలగించడానికి, మందులు చల్లడానికి వీలు కలుగుతుంది. తెగుళ్లను సులభంగా గుర్తించడానికి, సస్యరక్షణ చర్యలు తీసుకోవడానికి ఎలుకలను నివారణకు వీలవుతుంది. తుపాన్లు, భారీ వర్షాలు తదితర ప్రకృతి విపత్తులు ఏర్పడిన సమయంలో పైరులో కిరణజన్య సంయోగ క్రియ సమర్థవంతంగా జరిగి దిగుబడి తగ్గకుండా ఉంటుంది. పైరులో చీడపీడల ఉధృతిని దగ్గరగా గమనించి, దానికి అనుగుణంగా సకాలంలో సస్యరక్షణ చర్యలు తీసుకోవడానికి వీలవుతుంది. కాలిబాటల వెంట నడిచి ఎరువులు వేస్తే పొలం అంతా సమానంగా పడుతుంది. తగిన గాలి వెలుతురు, సూర్యరశ్మి అవసరం. కిరణజన్య సంయోగ క్రియ బాగా జరిగి మొక్కలో పత్ర హరితం అధికంగా ఉత్పత్తి అవుతుంది.

అవగాహన కల్పిస్తున్నాం

ఒక ఎకరా పొలంలో కాలిబాటలు వేయడానికి సుమారు రూ.800 ఖర్చు అవుతుంది. కానీ కాలిబాటలు వేయడంతో నాలుగు బస్తాల వరకు అధికంగా దిగుబడి రావడమే కాకుండా పంట కాలంలో చేను మొత్తం తిరగడానికి అనువుగా ఉంటుంది. దీనిపై మా సిబ్బందితో రైతులకు అవగాహన కల్పిం చడంతో ఇప్పుడు రైతులంతా కాలిబాటలు వేస్తున్నారు.

–రజినికుమారి, వ్యవసాయాధికారి, విజయపురం

వేణుగోపాలస్వామి ఆలయంలో అన్నదానం

కార్వేటినగరం: రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీసంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో పుత్తూరుకు చెందిన ఎం.ఎం.వేదవ్యాస కుటుంబ సభ్యులు టీటీడీ ఆలయ అధికారి సురేష్‌బాబు ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారి సురేష్‌కుమార్ మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి కూడా భక్తులు అన్నదానం చేయడానికి రావడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రతి శుక్ర, శనివారాల్లో అన్నదానం వేణుగోపాలస్వామి ఆలయంలో అన్నదానం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

పులిగుండుపై మేఘాల గొడుగు


పులి గుండుపై మేఘాలు

పెనుమూరు (కార్వేటినగరం): పెనుమూరు మండలంలోని పులిగుండు వద్ద నాలుగు రోజులుగా వాతావరణంలోని మార్పులకు మేఘాలు కమ్ముకున్నాయి. ఈ సందర్భంగా పులిగుండుపై మేఘాలు గొడుగులా మారి ఆకర్షణీయంగా కన్నులకు పండువగా వీక్షకుల మనసును దోచుకుంది. ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

నగరిలో జోరు వర్షం


నగరిలో కురుస్తున్న జోరు వర్షం

నగరి: మండల పరిధిలో ఆదివారం మధ్యాహ్నం నుంచి జోరు వర్షం కురిసింది. కొంత కాలంగా అడపాదడపా వర్షం పడుతున్నా అంతకు రెట్టింపుగా ఎండలు కాయడంతో వర్షం ప్రభావం కనిపించలేదు. అయితే ఆదివారం ఉరుములు, మెరుపులతో ఎక్కువ సమయం జోరు వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. పల్లపు ప్రాంతాలు నీటితో నిండాయి.

జీడీనెల్లూరులో..

గంగాధరనెల్లూరు: మండలంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సాయంత్రం నాలుగు గంటల నుండి దాదాపు ఎనిమిది గంటలపాటు భారీ వర్షం పడింది. భారీ వర్షానికి బొమ్మవారిపల్లి వంక పొంగి ప్రవహిస్తుండడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడ్డారు. జీడీనెల్లూరు వంతెనపై భారీ వర్షంలో లైట్లు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

కార్యకర్తలే పార్టీకి మూల స్తంభాలు


శ్యామ్‌కు కేక్ తినిపిస్తున్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్త కృపాలక్ష్మి

శ్రీరంగరాజపురం: కార్యకర్తలే వైఎస్ఆర్ సీపీకి మూల స్తంభాలని ఆ పార్టీ గంగాధరనెల్లూరు సమన్వయకర్త కృపాలక్ష్మి తెలిపారు. ఆదివారం నిర్వహించిన మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్యామ్ జన్మదిన వేడుకల్లో ముఖ్య అతిథిగా ఆమె పాల్గొన్నారు. శ్యామ్‌కు జన్మదిన శుభకాంక్షలు తెలిపి, బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. అనంతరం 49కొత్తపల్లిమిట్ట ప్రధాన కూడలి నుంచి బాణసంచా హంగామా నడుమ ర్యాలీగా వెళ్లి కాలనీలో ప్రజలకు పార్టీ సిద్ధాంతాలను వివరించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన భారీ కేక్‌కట్ చేసి అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు గురవారెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కాళప్ప, ఎంపీపీ సరిత జనార్దన్, జిల్లా క్రియాశీలక కార్యదర్శి విజయబాబు, కుప్పయ్య, ఎంపీటీసీ సభ్యులు కోటిరెడ్డిబాబు, నాయకులు స్కాలా, గోవిందస్వామి, హరిరెడ్డి, మణి, సుధ, శేషాద్రి, ఏసయ్య, దేవరాజులురెడ్డి, కానిక్య, భరత్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

కార్వేటినగరం: మండల పరిధిలోని కత్తెరపల్లి ఉన్నత పాఠశాలలో 1983–84వ సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయంగా సమావేశమయ్యారు. 41 సంవత్సరాల తరువాత విద్యాబుద్ధులు నేర్చుకున్న పాఠశాలలో కలుసుకున్నారు. దీంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. పాఠశాల ఆవరణలో ఉన్న సరస్వతీదేవి విగ్రహానికి పూజలు చేపట్టారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. పాఠశాల హెచ్ఎం చెంగల్‌రాజును శాలువాలతో ఘనంగా సన్మానించారు.

చదరంగం జీవితంతో ముడిపడి ఉంది


విజేతలతో సీఐ విక్రమ్, నిర్వాహకులు

నగరి: చదరంగం జీవితంతో ముడిపడి ఉందని సీఐ విక్రమ్ అన్నారు. మండలంలోని వీకేఆర్ పురం గ్రాండ్ వరల్డ్‌లో జిల్లా చెస్ అసోసియేషన్ సహకారంతో లయన్స్ క్లబ్ నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లాల చెస్ పోటీల ఫైనల్స్, బహుమతుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. చదరంగం పోటీలలో విజేతలకు బహుమతులను అందించారు. 220 మంది పోటీల్లో పాల్గొనగా సీనియర్స్ విభాగంలో టి.హేమాద్రి(నగరి), పీఆర్ ఆనందమోహన్, డి.వల్లభాచార్య (తిరుపతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించగా జూనియర్స్ విభాగంలో తిరుపతికి చెందిన సాయిచరణ్, గోపినేని మోక్షిత, డి.సాత్విక్ కృష్ణ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. అండ్–9 విభాగంలో నాగధృవిత(తిరుపతి), ఎస్ఆర్ ద్వారకార్జున్(చిత్తూరు), ఎస్.సహస్ర(తిరుపతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. ఇవిగాక సీనియర్ విభాగంలో 10 మందికి, జూనియర్స్‌లో 10 మందికి, ఏడేళ్లలోపు ఆడిన ముగ్గురికి, మహిళలు ఇద్దరికి, దివ్యాంగులు ఇద్దరికి ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ చదరంగ పోటీలు మనిషి మేధస్సుకు పదును పెడుతుందన్నారు. డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్, రిటైర్డ్ డిప్యూటీ డీఈఓ ప్రభాకర్ రాజు మాట్లాడుతూ గ్రామీణ పట్టణ క్రీడాకారులను ఏకం చేసే వారధిగా చెస్ టోర్నమెంట్ ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి చెస్ అసోసియేషన్ కార్యదర్శి బాలాజీ, ప్రతినిధి నవీన్‌కుమార్, నగరి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గజేంద్ర, కార్యదర్శి మోహన్, కోశాధికారి శక్తివేలు, సర్వీసు కమిటీ చైర్‌పర్సన్ రవి బాబు, నగరి చెస్ అసోసియేషన్ అధ్యక్షులు ఖలీల్ బాషా, సత్యానంద్ తదితరులు పాల్గొన్నారు.

పెనుమూరు ఎస్ఐగా వెంకట నరసింహం



పెనుమూరు(కార్వేటినగరం): పెనుమూరు ఎస్ఐగా ఈఎన్ వెంకట నరసింహం ఆదివారం పదవీ బాధ్యతలను స్వీకరించారు. గతంలో అనంతపురం జిల్లా నుంచి బదిలీపై పెనుమూరు ఎస్ఐగా వచ్చారు. పెనుమూరులో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ రామచంద్రయ్య అనంతపురం జిల్లాకు బదిలీపై వెళ్లారు. పదవీ బాధ్యతలు చేపట్టిన వెంకట నరసింహం మాట్లాడుతూ మండలంలో పేకాట, సారా తయారీ, కోళ్ల పందాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు.

ఘనంగా దుకాణం ప్రారంభోత్సవం


షాప్‌ను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి

నగరి: హైదరాబాద్ ఏఎంబీ మాల్‌లో చంద్రగిరికి చెందిన వైఎస్ఆర్ సీపీ నేత సులోచన జగదీష్ నూతనంగా ఏర్పాటుచేసిన టింజ్ వరల్డ్ బోటిక్ షాప్‌ను మాజీ మంత్రి ఆర్కేరోజా, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. సులోచనా జగదీష్ వ్యాపారంలో రాణించాలని ఆశీస్సులు అందించారు.

వైఎస్ఆర్ సీపీ కమిటీల నియామకం

పాలసముద్రం: వైఎస్ఆర్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పాలసముద్రం మండలంలో వివిధ విభాగాల కమిటీలను నియమించారు. ఎస్టీ విభాగం కమిటీకి ప్రెసిడెంట్‌గా భూపతి, వైస్ ప్రెసిడెంట్లుగా మణి, వెంకటేష్, జనరల్ సెక్రటరీలుగా పాపయ్య, వాణిశ్రీ, చిరంజీవి, జె.వెంకటేష్, సెక్రటరీలుగా లోకేష్, గోపి. వేలు, గజేంద్ర, సంచమ్మ, కార్యనిర్వాహక సభ్యులుగా వల్లియమ్మ, క్రిష్ణమూర్తి, ఉష, వైజయంతి, సి.సుబ్బమ్మ, మోహన్ నియమితులయ్యారు.

వాణిజ్య విభాగం కమిటీ

ప్రెసిడెంట్‌గా పద్మనాథనాయుడు, వైస్ ప్రెసిడెంట్లుగా వి.సుధాకర్, నాగరాజ్, జనరల్ సెక్రటరీలుగా నీరజాక్షులు, సి.మోహన్, పెరుమాళ్, కె.శేఖర్, సెక్రటరీలుగా ప్రసాద్, ఆర్.రేణు, శివ, సెల్వరాజ్, ఎస్.అన్బు, కార్యనిర్వాహక సభ్యులుగా పి.ఉమ, టి.దొరయ్య, ఎ.అములు, మాలా, గణేష్ మెల్లా నియమితులయ్యారు.

యువజన విభాగ కమిటీ

ప్రెసిడెంట్‌గా బి.ఆనంద్, వైస్ ప్రెసిడెంట్లుగా ఎస్.విష్ణు, టి.రాజ్‌కమల్, జనరల్ సెక్రటరీలుగా నాగరాజ్, హనస్టరాజ్, జి.గుణశేఖర్, ఎస్.మునస్వామి, సెక్రటరీలుగా క్రిష్ణ, సి.ప్రభాకర్, సి.మూర్తి, ఎస్.కేశవన్, ఎస్.శక్తివేల్, కార్యనిర్వాహక సభ్యులుగా ఎ.క్రిష్ణ, దినేష్, కె.శ్రీను ఆచారి, రోజా, డి.ప్రశాంత్ కుమార్, ఎ.వాసు నియమించబడ్డారు.

వైఎస్ఆర్ టీయూసీ విభాగం

ప్రెసిడెంట్‌గా పి.ప్రకాష్, వైస్ ప్రెసిడెంట్లుగా రాజేంద్రరాజు, ఆర్.రవి, జనరల్ సెక్రటరీలుగా పి.నాగరాజు, నాగరాజు, ఢిల్లీబాబు, జి.రాము, సెక్రటరీలుగా వేలాయధం, ఆర్.ప్రభు, ఎ.సుబ్రమణ్యారాజు, తరుణ్, ఆనంద్, కార్యనిర్వాహక సభ్యులుగా కె.సుబ్రమణ్యం, ఎ.శివకుమార్, వినాయగం, వెంకటేష్, క్రిష్ణమూర్తి, జె.జయరామ్‌లను నియమించారు.

వైభవంగా మునీశ్వర స్వామికి పూజలు


తొప్పనపల్లెలో మునీశ్వరస్వామి

గంగాధరనెల్లూరు: మండలంలోని తూగుంద్రం పంచాయతీ తొప్పనపల్లి గ్రామంలో మునీశ్వర స్వామికి పూజా కార్యక్రమాలను తొప్పనపల్లి అగుముడి మొదలి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పురుషోత్తం మొదలి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఈ సందర్భంగా తొప్పనపల్లి గ్రామంలో మునీశ్వర స్వామికి పలు పుష్పాలు, సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేకంగా అభిషేకం చేసి పలు పుష్పాలతో అలంకరించారు. ఈ కార్యక్రమంలో బెంగళూరు రిటైర్డ్ ఫారెస్ట్ ఆఫీసర్ కుమార్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వేలు మొదలి, నటరాజ్ మొదలి, గోవిందరాజులు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శంకర్ మొదలి, తిరువీధి కుప్పం మాజీ సర్పంచ్ దిలీప్ కుమార్, పాత వెంకటాపురం మాజీ ఎంపీటీసీ దేవేందర్‌రెడ్డి, శంకర్, మహాదేవ మంగళం వైఎస్ఆర్ సీపీ నేతలు కుప్పుస్వామి మొదలి, చంద్రన్ పాల్గొన్నారు.

వైభవంగా గంగ జాతర నిర్వహిద్దాం

- గ్రామసభలో తీర్మానించిన గ్రామ పెద్దలు


గ్రామసభలో జాతర నిర్వాహకులు, గ్రామస్తులు

నగరి: నగరి గంగ జాతరకు ఎంతో విశిష్టత ఉందని, ప్రతి ఏడాదిలా ఈ ఏడాది కూడా జాతరను వైభవంగా నిర్వహిద్దామని గ్రామసభలో జాతర నిర్వాహకులు తెలిపారు. ఆదివారం స్థానిక కరకంఠేశ్వర స్వామి ఆలయంలో గంగ జాతర నిర్వహణపై గ్రామసభ నిర్వహించారు. గత ఏడాది జాతర నిర్వహణకు సంబంధిత జమా ఖర్చుల వివరాలను వివరిస్తూ గత ఏడాది నిల్వ ఉన్న మొత్తం, అమ్మవారికి అందిన కానుకలు, దాతలు అందించిన సహకారాలను నిర్వాహకులు చిరంజీవిరెడ్డి గ్రామసభ దృష్టికి తెచ్చారు. సెప్టెంబరు 2వ తేదీ మంగళవారం రాత్రి చాటింపు, 9, 10, 12 తేదీలలో గంగ జాతర జరుగుతుందన్నారు. జాతర నిర్వహణలో ఏవైనా సలహాలు సూచనలు ఇవ్వాలని గ్రామస్తులను కోరారు. ఈ సందర్భంగా గ్రామదేవత సామూలమ్మ ఆలయ నిర్వాహకులు చలపతి మాట్లాడుతూ గత ఏడాది చాటింపు సందర్భంగా వర్షం రావడంతో అందరూ ఇబ్బంది పడ్డారని ఆ సమస్య రాకుండా ఈ ఏడాది ఆలయం వద్ద తన స్వంత నిధులు సుమారు 7 లక్షల వ్యయంతో షెడ్డు, వంట గది ఏర్పాటు చేస్తానని సభలో తెలిపారు. గ్రామపెద్దలు ఆయనకు అభినందనలు తెలిపారు. జాతర నిర్వాహకులు చిరంజీవిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం జాతర నిర్వహణ ప్రాంతం పక్కన కాంప్లెక్స్ తొలగించి ఉండడంతో అక్కడ ఖాళీ స్థలం ఉందని ఆ స్థలంలో పరమేశ్వరుడు, వినాయకుడు, మురుగుడు విగ్రహాలను జాతర సందర్భంగా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ అంశాన్ని అందరూ ఆహ్వానించారు. జ్యోతిరెడ్డి, ఆనం సురేష్, సీకే దయానిధి, కృష్ణారెడ్డి, గుణశేఖర్, జ్యోతి నాయుడు, ఆర్.బాబు, గోపాల్ రెడ్డి, ఇంద్రయ్య, ఎంవీ హరి బాబు, రామూర్తి యాదవ్, సుబ్రమణ్యం, ఎంవీ శ్రీనివాసులు, టీకే శ్రీనివాసన్, ఎంవీ బాబు, రమేష్, కోలా బాలాజీ, బాబు రెడ్డి, వెంకటముని, కేపీ మణి, రాము, వేలు, కుమార్, మునిరత్నం, వీరయ్య, గిరి, మురళి, జనార్దన్, శంకర్, ధన, రాజేష్, మహేష్, అశోక్, విక్కీ, సునీల్ పాల్గొన్నారు.


ఆకట్టుకున్న దుర్యోధన వధ


దుర్యోధన వధలో వేషధారులు

పాలసముద్రం: మండలంలోని యస్ఆర్ కండ్రిగ గ్రామంలో వెలసిన ద్రౌపదీ అమ్మవారి ఆలయ వార్షిక మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జరిగిన గదాయుద్ధం, దుర్యోధన వధ ఘట్టాలు రసవత్తరంగా సాగాయి. కురుక్షేత్ర యుద్ధం ముగింపులో సర్వం కోల్పోయిన దుర్యోధనుడు అస్త్ర సన్యాసం చేసి తపస్సుకు వెళ్తాడు. అప్పుడు భీముని వేషధారి మునస్వామి, దుర్యోధన వేషధారి రామయ్యను రెచ్చగొట్టి యుద్ధానికి ప్రేరేపించే సన్నివేశం ఆద్యంతం ఆకట్టుకుంది. చివరిగా దుర్యోధనుడిని వధించే సన్నివేశాన్ని వెంకటేశ్వర నాట్య కళాకారులు రక్తి కట్టించారు. ఈ సన్నివేశాన్ని తిలకించడానికి తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు, మండల పరిధిలోని ప్రజలు తరలివచ్చారు. ఈ ఉత్సవాలకు వచ్చిన వారికి శ్రీకావేరిరాజుపురం గ్రామానికి చెందిన శ్రీనివాసులు నాయుడు కుటుంబ సభ్యులు అన్నదానం చేపట్టారు. సాయంత్రం కాపు కట్టుకున్న భక్తులు తొమ్మిది సేద్యపు బావుల్లో స్నానాలు చేసి, దేవాలయం ఎదుట అగ్నిగుండ ప్రవేశం చేశారు.

ఆధ్యాత్మిక చింతనతోనే ఆనందం

- వేడుకగా కుంభాభిషేక మహోత్సవం
- పట్టువస్త్రాలు సమర్పించిన మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, సమన్వయకర్త కృపాలక్ష్మి



పట్టు వస్త్రాలు తెస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, కృపాలక్ష్మి, పూజలు చేస్తున్న నాయకులు

వెదురుకుప్పం: ఆధ్యాత్మిక చింతనతోనే జీవితం ఆనందమయమని మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. మండలంలోని సీఆర్‌కండ్రిగ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయ కుంభాభిషేక మహోత్సవాల్లో ఆదివారం ఆయన వైఎస్ఆర్ సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త కృపాలక్ష్మితో కలసి పాల్గొన్నారు. స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. వారికి ఆలయ అభివృద్ధి కమిటీ, ఋత్వికులు పూర్ణ కుంభంతో సాదరంగా స్వాగతించారు. అనంతరం మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఎస్సీ కాలనీల్లో ఎక్కడా లేని విధంగా ఆలయాన్ని తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. ధర్మకర్త రామయ్య, గ్రామస్తులు, దాతలను అభినందించారు. అన్నదానం నిర్వహిస్తున్న తులసీ రెడ్డి దంపతులను మాజీ మంత్రి అభినందించారు. అనంతరం అగ్గిచేనుపల్లె గ్రామంలో జరిగిన కుంభాభిషేక మహోత్సవంలో పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్, ఎంపీటీసీలు తోకల మురళీరెడ్డి, రాధిక, భాస్కర్, కో–ఆప్షన్ సభ్యుడు వెంకటేష్, మాజీ జెడ్పీటీసీ బండి గోవర్ధన్‌రెడ్డి, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు బండి హేమసుందర్ రెడ్డి, బూత్ కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివాజీ, పంచాయతీ వింగ్ జిల్లా కార్యదర్శి గోవిందయ్య, నియోజకవర్గ వైద్య విభాగం అధ్యక్షుడు ప్రకాష్, బూత్ కమిటీ నియోజకవర్గ కన్వీనర్ నారాయణరెడ్డి, జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, మండల ఉపాధ్యక్షులు చిరంజీవిరెడ్డి, గోవిందన్, సర్పంచ్ శిల్ప, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, మాజీ డైరెక్టర్ మునికృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ ధనుంజయరెడ్డి, యువత మాజీ అధ్యక్షుడు నరేష్‌రెడ్డి, విద్యార్థి విభాగం అధ్యక్షుడు జగదీశ్‌రెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, పురంధర్‌రెడ్డి, ఉన్నారు.

వేడుకగా ఉత్సవాలు

సీఆర్‌కండ్రిగలో వినాయక స్వామి ఆలయంలో కుంభాభిషేక మహోత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం వేదపారాయణం, ప్రధాన కలశ స్థాపన, రుద్రాభిషేకం, మహా గణపతి, నవగ్రహ, గోపురశిఖర నవరత్న నిక్షేపణ పూజలు చేశారు.


మాట్లాడుతున్న మాజీ మంత్రి నారాయణస్వామి


పూజల్లో పాల్గొన్న భక్తులు